# మొల్ల రామాయణం- వస్తు విశ్లేషణ

ఆచార్య జి. అరుణకుమారి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

పరిచయం: ప్రపంచాన్నే ప్రభావితం చేసిన వాల్మీకి రామాయణం క్రీస్తు పూర్వం ఒకటవ శతాబ్దం నాటిదని అంటారు. భగవంతుని లీలలను, మానవ ధర్మాన్ని, ప్రతివ్రతా ధర్మాన్ని చాటి చెప్పే రావ ాయణ కావ్యాన్ని భారతీయ సంస్కృతిక రూపుదిద్దిన అసాధారణ శక్తగా పరిగణిస్తారు. పండితులకే పరిమితమైన వేదోపనిషత్తుల సారాన్ని రామాయణ కావ్యం, మహాభారతేతిహాస రూపంలో సామా న్య మానవులకు అందించారు. రెండు వేల సంవత్సరాల క్రితం నాటి వాల్మీకి రామాయణం దేశకా ల పరిస్థితులకు అనుగుణంగా అనేక భాషలలోకి అనేక దృష్టి కోణాలత అనువాద రచనకు పాత్రవ ంయ్యింది.

అష్టాదశ పురాణాలు, రామాయణ మహాభారతాలు, భగవద్గీత మొదలైన గ్రంథాలు గుప ్తుల కాలం నాటివని చారిత్రక విమర్శకుల అభిప్రాయం. పురాణాలకు పోటీగా బౌద్ధ జాతక కథలు ఆవిర్భవించాయని, బుద్ధుని జాతక కథలను మార్చి రామకథను రచించారని మన చరిత్ర పేర్కొన్న ది. వైదిక మతస్థులు సురలని, బౌద్ధ మతస్థులు అసురలని వీరి మధ్య జరిగిన సంఘర్షణే కావ్య వ స్తువులయ్యాయనేది పండితుల అభిప్రాయం. సీతమ్మ వారి అగ్ని పరీక్ష విష్టుకుండినుల కాలంనాటి దివ్య పరీక్షలను (అగ్ని పరీక్ష, జల పరీక్ష) పోలి ఉండడం దేశకాలపు స్థితిగతులు కాలానుగుణంగా కావ్యంలో చోటు చేసుకోవడం కనిపిస్తుంది.

కవుల ప్రతిభకు అలంకారికాలైన అవాల్మీక కల్పనలెన్నో తెలుగు కవుల కలం నుండి జాలువారాయి. భారత రచనా విశేషాలను మనోహర కల్పనలను పండితులు 12వ శతాబ్దంలో ం ాామాయణాంధ్రీకరణకు పూనుకొని ఆంధ్ర దేశంలో జన వ్యాప్తిలో ఉన్న కథలను విశేషాలను రామా యణంలో చేర్చటం కనిపిస్తుంది. దేశ కాలాలననుసరించి రామ కథలో భిన్నత్వంచోటు చేసుకుంది . వాల్మీకి రామాయణాన్ననుసరించి సంస్కృతంలో ఆనంద, అద్భుత, ఆధ్యాత్మ, విచిత్ర, పట్టాభి రావ ాయణాలు వెలుగు చూశాయి. జైన, బౌద్ధ జాతక కథలలో దశరథ జాతక కథ, జైన గ్రందాలలో విమలసూరి రచించిన సుఉమచరియ లేదా పద్మ చరిత్రలో రాముడిని పద్మడిగా వ్యవహరించారు. జానపద సాహిత్యంలో అవాల్మీక రామాయణ కథనాలు వినిపిస్తాయి. సీతన్వేషణకై వెళ్ళిన రాముని కి దారిలో సీతమ్మవారి జాడ చెప్పినందుకు చిలుక రామచిలుకగా, కోకిల గానకోకిలగా మెప్పునం దుకున్నాయి. బదరీ వృక్షం ఎడారిలోనూ జీవించేట్టుగా సీతమ్మ జాడ చెప్పినందుకు వరాన్ని పొంది ంది. అడవిలో మామిడి పండును గుర్తించడానికి హనుమంతుడు పండు చివరి భాగాన్ని కొరికాడని అందుకే మామిడి పండు కొనదేలి ఉంటుందని.... పలు రకాల కథనాలు జానపద సాహిత్యంలో చోటు చేసుకున్నాయి.

ఇతర దేశాలలో రామాయణ గాథలు మరో కోణంలో ప్రదర్శితమవుతాయి. మాయలేడికై వచ్చిన రాముని ఆర్థనాదం విని సీతమ్మవారిని విడిచి వెళ్ళని లక్ష్మణుని సీత దూషిస్తుంది. లక్ష్మణుడు లక్ష్మణరేఖ గీయటం మన సాహిత్యంలో వర్ణితమైతే బాలి ద్వీపంలో లక్ష్మణుడు తన మర్మాంగాన్ని ఖండించి వేస్తాడు. బాలి, కాంబోడియా దీవులలో రామాయణం కొంత భిన్నంగా కనిపిస్తుంది. వీటన్నిటికీ కారణం మానవ కల్పనా శక్తి విస్తరించినంత మేరకు రచన కొనసాగటమే.

తెలుగు సాహిత్యంలో మొల్ల రామాయణం ప్రచారంలోకి రావటానికి ప్రధాన కారణం 'తేనెసోక నోరు తీయనయగు రీతి తోడ నర్థమెల్ల తోచకుండ గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము మూగ చెవిటి వారి ముచ్చటగును' అని దానికి పరిష్కారంగా 'కందువ మాటలు సామెత లందముగా గూర్చి చెప్ప, నది తెలుగునకుం బొందై, రుచియై వీనుల విందై, మఱికానిపించు విబుధుల మదికిన్' అన్నట్టుగా కావ్యాన్ని తీర్చిదిద్దటమే.

మధ్యయుగంలో వచ్చిన భక్తి ఉద్యమం సమాజంలోని అట్టడుగు వారికి, అణచబడ్డ వారిని ఒక భావావేశ వ్యక్తీకరణకు అవకాశం కల్పించింది. మనస్సును వ్యక్తపరచటం వీలుపడని సామాజిక వాతావరణంలో భక్తి స్త్రీకి అభివ్యక్తి సాధనమయ్యింది. 16వ శతాబ్దంలో తులసీదాసు రామాయణాన్ని సామాన్య మానవులకు అందుబాటులో ఉండాలని హిందీ భాషలో 'రామచరితమానస్'గా వాల్మీకి రామాయణాన్ని అనువదించినందుకు ఆనాటి మత ఛాందసులు అతనిని సమాజం నుండి నెట్టివేశారు.

మొల్ల కాలనిర్ణయం: భిన్నాభిప్రాయాలు

నెల్లూరు సమీపంలోని గోపవరం నివాసి అయిన ఆతుకూరి మొల్ల తనను గురించి రామాయణ పీఠికలో 'గురులింగ జంగమార్చన పరుడును శివభక్తి రతుడు బాంధవహితుడున్ గురుడాతుకూరి కేసయ వరపుత్రిని మొల్ల యనగ వఱలినదానన్' అని చెప్పుకుంది. పూర్వకవుల స్మృతిలో వాల్మీకి, వ్యాస, భారవి, మాఘ, భవభూతి, భట్టబాణు, కాళిదాసాది సంస్కృత కవులను నాచనసోముని,(వేములవాడ) భీముని, నన్నపార్యుని, శ్రీనాథుడిని, రంగనాథుడిని, తిక్కకవిరాజును స్తుతించి స్మరించింది.

- శ్రీనాథుడిని పేర్కొనటం వల్ల శ్రీనాథుడి తరువాతి కాలం నాటిదని గుర్తిస్తున్నాం.
- ప్రతాప చరిత్ర (క్రీస్తు శకం 1550) లో మొల్ల రెండవ ప్రతాపరుద్రుని ఆస్థాన కవయిత్రి అని, తాను రచించిన రామాయణాన్ని ప్రతాపరుద్రునికి అంకితమివ్వాలని అనుకున్నట్టుగా ఏకామ్రనాథుడు పేర్కొన్నాడు. (ముదిగంటి సుజాతారెడ్డి –ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర. పుట 93)
- ఏకామ్రనాథుడు (క్రీ.శ.1600) రచించిన ప్రతాప చరిత్రలో మొల్ల ప్రశంస ఉంది.( జి.నాగయ్య– తెలుగుసాహిత్య సమీక్ష, పుట 241)
- ప్రతాప చరిత్ర రాసిన ఏకామ్రనాథుడు (కాలం సరిగా నిర్ణయం కాలేదు. 15వ శతాబ్ది ఉత్తర భాగం వాడని చూచాయగా అంటూ ఉన్నారు) 'తిక్కన సోమయాజి వరప్రసాదంబు చేత కుమ్మర మొల్ల రామాయణంబను వచన కావ్యంబు రచియించి ప్రతాపరుద్రున కంకితవ

ఝ్మగా సేయు సమయంబున' శూద్రకవిత్వమని నిషిద్ధమని నిరాకరించాడని, భాస్కరుని విద్వాంసులు పిలిపించి శ్రీమద్రామాయణాన్ని విన్నారని అచట యొక పద్యంబు చిత్రంబుగా చదువుటయు అని...' (సిద్దేశ్వర చరిత్ర-పుట 160లో ఉన్న విషయాన్ని) ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ మొల్ల రామాయణానికి రాసిన ముకుంద వికాసం, (పుట 4)లో పేర్కొన్నారు.

- 14,15 శతాబ్దాలలో జీవించి ఉండవచ్చని లక్ష్మీకాంతమ్మగారి అభిప్రాయం
- శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి కవి తెనాలి రామకృష్ణుని హాస్యోక్తి సల్లాపాలకు మొల్ల పాత్రమయ్యిందనే అభిప్రాయముంది. శ్రీ వడకుదుటి వీరరాజు రచించిన 'రాయలనాటి చాటు పద్యములు', ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన వ్యాసంలో మొల్ల 16 వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో తెనాలి రామకృష్ణ కవిని ప్రశ్నికునిగా చేసి సీస పద్యం అశువుగా చెప్పిందని వివరించారు.
- చిలుకూరి వీరభద్రరావు గారు ఏకామ్రనాథుడు ప్రతాపరుద్రుని సమకాలికుడని చెప్పదగిన ఆధారాలు లేవు. ఇతనిననుసరించి మొల్ల జీవిత కాలాన్ని నిర్ణయించటం పొసగని విషయమని అన్నారు. ఈ కవి తన కాలంలో వ్యాప్తిలో ఉన్న కథలాధారంగా మొల్ల ప్రతాపరుద్రుని ఆదరాన్ని పొంది ఉన్నదని రాసినట్టుగా ఊహించడానికి వీలుందన్నారు.
- శ్రీ పూండ్ల రామకృష్ణయ్య 'మొల్ల రామాయణం' అనే వ్యాసంలో నెల్లూరు జిల్లా మాన్యులు అనే గ్రంథంలో శ్రీ బాస్వలు దొరగారు 698వ పుటలో మొల్ల కుమ్మర కులోద్భవురాలు అని, తిక్కన సోమయాజి సమకాలీనురాలని, నెల్లూరు జిల్లాలోని పడుగుపాడు గ్రామ నివాసి అని తెలుగు రామాయణ పద్య కావ్యం రచించిందని పేర్కొన్నారు.
- బొద్దికూరపాడు వేంకటరంగకవి 'పూర్వ కవుల చరిత్రము'లో తిక్కన తండ్రియగు కొమ్మనామాత్యునకు, కుంభకారకులీనుడైన రంగప్ప కూతురికి మొల్ల పుట్టినట్లు తెలిపారు.
- కావలి వెంకట రామస్వామి పండితుడు క్రీ.శ.2847లో బొంబాయిలో ముద్రించబడిన 'దక్షిన హిందూస్థానపు కవుల చరిత్ర' లో మొల్ల కుమ్మరవాని కూతురని, కృష్ణదేవరాయల కాలంలో ఉన్నదని, స్నానాంతరం తల వెంట్రుకలార్చుకొనే సమయంలో రామాయణాన్ని రచించిందని పేర్కొన్నారు. తిక్కనకు కృష్ణదేవరాయలకు సుమారు రెండు వందల సంవత్సరాల ఎడమున్నది. తిక్కన కాలంనాటి మొల్ల రచన ఎక్కడున్నదో విచారించాలి. అని మనకుపలభ్యమయ్యే రామాయణం శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి మొల్ల రచించినదని వెల్లడించారు.
- ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ క్రీ.శ. 1295-1340 మధ్య కాలంలో రెండవ ప్రతాపరుద్రుని సమయంలో మొల్ల బాలికయై వచన రామాయణం రాసి ఉండవచ్చని 1395-1400 కాలంలో శ్రీనాథుని శృంగార ప్రాఢకవిత్వాలను బాగా ఎరిగినదై రామాయణాన్ని రచించి 1320-1405 సమయంలో జీవించి ఉండవచ్చని తెలిపారు.

● మొల్ల 80, 90, 96 ఏళ్ళు జీవించిందని పలువురి అభిప్రాయం.

బెంగాలీ సాహిత్యం:

బెంగాలీ సాహిత్యంలో మొట్టమొదటి రచయిత్రి చంద్రబాతి. 16వ శతాబ్దం నాటి రచయిత్రి. ఈమెను ప్రసిద్ధ రచయిత్రిగా పరిగణించలేదు. వాల్మీకి రామాయణంలో యుద్ధకాండపెద్దది. చంద్రబాతి రచించిన రామాయణంలో యుద్ధకాండను విడిచిపెట్టి స్త్రీల పాటలుగా యుద్ధ వర్ణన కొనసాగుతుంది. ఈ పాటలను సీత పాడుతుంది. యుద్ధాన్ని కలలో చూస్తుంది. బెంగాలీ వారికి మొల్ల ప్రశంసనీయురాలు. సీతా పరిత్యాగోత్తర కాండను ఈ కవయిత్రులిద్దరూ స్పృశించలేదు. ఇద్దరూ అవివాహితులు, శివభక్తులు, కవయిత్రులు, రామాయణ కావ్యాన్ని రచించారు. చంద్రబాతి రామాయణంలో స్త్రీ పరమైన భావజాలం కనిపిస్తుంది.

తమిళ సాహిత్యంః

ము.వరదరాజన్ 'స్టడీస్ ఇన్ శ్రీవైష్ణవ లిటరేచర్'లో మొల్ల కులం, మొల్ల పదానికి అర్థం, మొల్ల శ్రీ కృష్ణదేవరాయల ఉంపుడగత్తెగా కొందరు పండితులు అభిప్రాయాన్ని వెల్లడించారని, బసివి బసవేశ్వరుని సేవ చేసేదనే అర్థంలో ప్రయోగించారని మొల్లను గూర్చి వ్యక్తిగతాంశాలను ప్రస్తావించారు.

మొల్ల కాలాన్ని అనేక ఆధారాలతో నిరూపించవచ్చు. ఇంతవరకు కావ్యపీఠిక ఆధారంగా, పండితుల, కవుల రచనల ఆధారంగా పరిశీలించినట్లయితే 1320-1580 వరకు మొల్ల కాలాన్ని సాహిత్యం గుర్తిస్తుంది. రెండవ ప్రతాపరుద్రుని కాలంలోనూ, శ్రీకృష్ణదేవరాయల కాలంలోనూ ఉన్నట్టుగా ఆధారాలను చూపిస్తున్నారు. ఆంగ్ల ప్రభుత్వం వచ్చిన తరువాతే చారిత్రకాంశాలను సేకరించారు. మొల్ల రామాయణం తాళపత్ర గ్రంథంలోని లిపిని బట్టి, పదబంధనలు బట్టి, పదాలను బట్టి కాల నిర్ణయం చేసే అవకాశం ఉంది. వర్ణనలను ఆధారంగ చేసుకొని వస్తువును ఆధారంగా చేసుకొని కొంత నిర్ణయం చేయవచ్చు. మొల్ల రామాయణానికి నకలు దొరుకుతుంది.

మొల్ల రామాయణం- అవతారిక

మొల్ల రామాయణ పీఠికలో 24 గద్య పద్యాలున్నాయి. మహాగుణశాలి, దయాపరుండు భక్తులను ్ర బోచే శ్రీరాముడిని, శుభములు కలుగజేసే శేషవిభూషణుండు, విద్యానిధి మల్లికార్జునుడిని, శ్రీ విఘ్నరాజును ప్రథిత వాక్ప్రౌఢి సేవించి ప్రస్తుతిస్తానని ముదంబు గూర్చు విద్యాలయ, వాణి శబ్దముల నర్థములన్ సతతంబు మాకిడున్ అని రాముడిని మల్లికార్జునుడిని, కృష్ణుడిని, కాంచనగర్భుడు విష్ణువుని, వినాయకుడిని, కాముని తల్లి లక్ష్మీదేవిని, సరస్వతి, పార్వతి దేవిని స్తుతించి పూర్వకవులను స్మరించింది. దేవతా స్త్రీ స్వభావ వర్ణనలో తన ప్రత్యేకతను చాటుతూ పురుష కవులకు తోచని విశేషణాన్ని ప్రయోగించింది. లక్ష్మీదేవిని కాముని తల్లిగా వర్ణించింది.

'అది రఘురాము చరితము నాదరముగ విన్న గ్రొత్తయై లక్షణ సంపాదమ్మై పుణ్యస్థితి వేదమ్మై తోచకున్న వెట్టినె చెప్పన్' అని రామచరితము భూజన కల్పమని, భుక్తికి ముక్తికి మూలమని, దైవమని నుతిస్తే తప్పా అని ప్రశ్నించింది.

మత ప్రచారం కోసం వీర శైవులు బసివీలను, వైష్ణవులు గరుడ బసివీలను సృష్టించారు. విజయనగర రాజుల కాలంలో వందల కొద్దీ దేవాలయాలు వెలిసాయి. ఆలయాల్లో దేవు

ని సేవాకైంకర్యాలకై దేవదాసీ విధానాన్ని ప్రవేశ పెట్టారు. బసవేశ్వరుని భక్తురాలు బసివి అనే అర్థంలో ప్రయోగించబడిన పదం కాలక్రమేణా అర్థపరిణామం చెందింది. శ్రీరాముడు క్షేత్ర సంప్రదాయంల ప్రధాన దైవంగా క్రీ.శ.15 వ శతాబ్దం నాటికి నెలకొన్నాడు. నెల్లూరు జిల్లా ఒంగోలు శాసనాలలో క్షేత్ర సంప్రదాయంలో శ్రీరాముని ప్రసిద్ధి జన బాహుళ్యంలో వ్యాపించిన విధానాన్ని సూచిస్తున్నాయి.

మొల్ల రామాయణం– వస్తు విశ్లేషణ:

మొల్ల రామాయణం సరళ గంభీర కావ్యం. దీనిని ప్రథమాంధ్ర సంగ్రహ రామాయణంగా భావిస్తున్నారు. ఆమె రచించిన సంగ్రహ రామాయణంలో ఇతివృత్తం శ్రీరాముని దివ్యచరితం. వాల్మీకి రావాయణంలో నారద మహర్షి వాల్మీకికి చెప్పిన రామాయణాన్ని ఆధారంగా చేసుకొని ప్రతి ఆశ్వాసం ఆరంభంలో నారద మునీంద్రుడు వాల్మీకి కెరింగించిన తెరంగు వినిపించెదనని మొదలు పెట్టింది మొల్ల. శ్రీరామచంద్రుని కృతి భర్తగా ఎన్నుకుంది. మొల్ల రామాయణం రాముని జననంతో మొదలై పట్టాభిషేకంతో ముగుస్తుంది.

మొల్ల రామాయణంలో బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందర, యుద్ధకాండలను ఆరు కాండలుగా చేసి అవతారికలో 24, బాల కాండలో 100, అయోధ్య కాండలో 43, అరణ్య కాండలో 75, కిష్కింధ కాండలో 28, సుందరకాండలో 249, యుద్ధ కాండలో మూడు ఆశ్వాసాలు 352 గద్య పద్యాలను రచించింది. మొత్తం 871 గద్య పద్యాలు. ఆశ్వాసాంతంలో ఒకే పద్యం పునరుక్తం కావటం వలన పరగణలోకి తీసుకోకపోవటం జరిగింది. వాటిని చేర్చినట్లయితే సుమారు 880 వరకు గణించవచ్చు. మొల్ల రామాయణంలో సుందరకాండ, యుద్ధకాండ విస్తృతమైనవి. మన తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి సంగ్రహ రచన చేసినవారు లేకపోలేదు.తిక్కన సోమయాజి, ఎర్రన, రంగనాథుడు, తాళ్ళపాక అన్నమయ్య, కొరవి సత్యనారాయణ, శాఖవెల్లి మల్లికార్జున భట్టు మొదలైన కవులు మొల్లకు పూర్వం రామాయణ రచన చేపట్టిన వారు.

ఎన్ని రామాయణాలున్నా మొల్ల రామాయణానికున్న ప్రాచుర్యం తక్కిన రామాయణాలకు లేకపోవటానికి కారణం ఆమె చూపెట్టిన నవీన పద్ధతే. భక్తి కర్మ జ్ఞాన మార్గాలలో మొల్ల ఎన్నుకున్న మార్గమూ భక్తే. నిజకృప మునుపం 'భక్తియె కారణమగును కాని చదువు కారణ మగునె' అని పలికింది.

బాలకాండ:

అయోధ్యా పురవర్ణనతో శ్లేషార్థాలంకారాలతో రమణీయంగా ఆరంభమవుతుంది. కాబట్టే మొల్ల ప్రబంధ కాలానికి చెందినదిగా భావించడానికి అవకాశాన్ని కల్పిస్తుంది. దశరథుని చేత పుత్ర కామేష్టి చేయించింది మొల్ల. అగ్ని దేవుడు ప్రత్యక్షమై ఇచ్చిన పాయసాన్ని దశరథుడు రెండు భాగాలు చేసి పెద్ద భార్యలైన కౌసల్య, కైకేయిలకు అందిస్తాడు. వారిద్దరు తమ వంతులో సగభాగాన్ని సుమిత్రకిస్తారు. వాల్మీకి రామాయణంలో దశరథుడు పాయసాన్ని రెండు భాగాలు చేసి ఒక భాగాన్ని కౌసల్యకిస్తాడు. మిగిలిన సగంలో సగభాగాన్ని అంటే 1/4 వంతు పాయసాన్ని సుమిత్రకిస్తాడు. మిగిలిన పావు వంతును సగం చేసి 1/8 వంతును కైక కిచ్చి మిగిలిన భాగాన్ని సుమిత్రకిస్తాడు. కౌసల్యకు

4/8 సుమిత్రకు 3/8 కైకకు 1/8 భాగాలు తానే ప్రత్యక్షంగా ఇస్తాడు. దశరథుని పాత్రలో కనిపించే అసమానతను మొల్ల తొలగించిందని ప్రత్యేకించి ఈ సందర్భంలో చెప్పనవసరం లేదు. పాత్ర చిత్రీకరణలో అందులో రామభక్తులకెటువంటి మచ్చ పడనీయదు.

వాల్మీకి రామాయణంలో రామాదుల జన్మతిథి నక్షత్రాలు మాత్రమే చెప్పాడు. మూలంలో లేని వారాలను భాస్కర రామాయణంలో చూడవచ్చు. భాస్కర రామాయణంలో రాముడు బుధవారం, భరతుడు గురువారం, లక్ష్మణ శతృఘ్నులు శుక్రవారం పుడతారు. మొల్ల రామాయణంలో రాముడు ఆదివారం పుట్టాడు. పునర్వసు నక్షత్రం కర్కటక లఘ్నంలో చైత్ర శుద్ధ నవమినాడు జన్మించినట్లుగా మొల్ల వర్ణించింది. నలుగురు బిడ్డలను ఒక్కసారే రాణులు కాంచిరి అనటంలోను సమత కనిపిస్తుంది. అందరూ ఒక్కరోజే జన్మించినట్టుగా భావించాలి. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చదువు సంధ్య ధనుర్విద్యలు సంగ్రహంగా వచనంలో చెప్పింది. రామలక్ష్మణులు విశ్వామిత్రునితో మిథిలా నగరానికి వెళుతుండగా మార్గమధ్యంలో రామపాదధూళి సోకి ఒక రాయి చక్కని చుక్కై ఎదుట చిత్రంగా నిలిచింది. కంద పద్యంలో రాయి క్రమంగా నాతిగా మారటాన్ని మొల్ల వర్ణించిన తీరు గమనించండి. అచేతనం చేతనమైనపుడు, బండ స్త్రీగా మారినపుడు మనకంటే ముందు ఒక చిత్రం కదలాడుతుంది.

పదనై యొప్పిదమై, కడుం<br>
గదలచు బంగారు పూదె కరిగిన రీతిన్<br>
మొదలుచు లావణ్య స్థితి<br>
సదతిగ జూపట్టి నిలిచె సురుచిరలీలన్

బాలకాండ, 63 వ పద్యం

వాల్మీకి రామాయణంలో గౌతముడు అహల్యను వాయి భక్షణం చేస్తూ భస్మశాయినివై ఎవరినీ కాక రాకుండమని శపించాడు. ఇది జారత్వ దోషానికి ప్రాయశ్చిత్వం. అహల్య శిలగా మారిందని పద్మ పురాణం తెలియచేస్తుంది.దీనిని గురించి యాజ్ఞవల్క్య పరాశరులు చర్చించటం వలన ఇది ఆనాటి సామాజిక న్యాయ శాస్త్ర రీతులను వివరిస్తుంది. పోషణ సంస్కరణ లేని స్త్రీ బూడిద బుంగి కావటం సహజం కానీ సదతి రాయిగా మారటం అసహజం. తిరస్కరింపబడిన స్త్రీ హృదయం రాయిగా మారిందన్న అర్థంలో ప్రయోగించారని చెప్పవచ్చు. నిద్రాహారాలు మాని అచేతన స్థితికి లోను కావటమూ సహజమే. డిప్రెషన్‌కు గురైన వారి పరిస్థితి ఈ విధంగానే ఉంటుంది. అహల్య పూర్వ వృత్తాంతాన్ని ఇక్కడ ప్రస్తావించక విడిచి పెట్టింది. రామునికి సంబంధించిన ప్రధాన కథనే వస్తువును స్వీకరించింది కానీ ఉపకథలను విడిచిపెట్టింది.

సీతా స్వయంవరం సందర్భంలోను మొల్ల చేసిన మార్పును చూపిన నేర్పు కుమార సంభవంలో దక్షయజ్ఞాన్ని, కళాపూర్ణోదయంలో విష్ణుకొలువులో విష్వక్సేనుని అదలింపులకు భయపడిన వారి మనోభావాలను జ్ఞప్తికి తెస్తాయి. కామినీ స్వయంవరానికి రాకుమారులు భుజంబు భుజంబు ద్రోపులాడగ వచ్చారు. శివ ధనస్సును వేదిక మధ్యకు తీసుకురావటానికి గురుభుజ శక్తి గల్గు పదికోట్ల జనంబులను జనకుడు పంపాడు. వాల్మీకి రామాయణంలో శివధనస్సును తీసుకురావటా

నికి ఐదువేల మందిని పంపి ఎనిమిది చక్రాలున్న ధనువు పేటికను తెప్పించాడు జనకుడు. మొల్ల రామాయణంలో రాకుమారులు విల్లును చూసి ఇది విల్లా కొండా అని భయకంపితులయ్యారు.

కొందఱు డగ్గఱనోడిరి
కొందఱు సాహసము చేసి కోదండముతో
నందంద పెనగి పాఱిరి
సందుల గొందులను దూఱి సత్వము లేమిన్

– బాలకాండ, 74వ పద్యం

జనకుడు విశ్వామిత్రునితో రామలక్ష్మణులకు విల్లును చూపించమని అడగటం, విశ్వామిత్రుడు రావణునితో విల్లును చూడమని చెప్పగా రాముడు బాణాన్ని పూరించే సమయంలో మొల్ల వర్ణనా చాతుర్యాన్ని గమనించినట్లయితే శైవ భక్తి తో పాటు విష్ణు భక్తి మెండుగా కనిపిస్తుంది.'కదలకుమీ ధరాతలమ కాశ్యపి బట్టు ఫణీంద్ర భూవిషాస్పదులను బట్టి కూర్మమ రసాతల భోగిఢులీకులీశులన్ వదలక పట్టు సృష్టి ధరణి ఫణి కచ్ఛప పోత్రి వర్గమున్ బొదువుచు బట్టుడీ కరులు భూమీసుడీశుని చాపమెక్కడున్'

–బాల కాండ, పద్యం 78

ఓ భూమీ! నువ్వు కదలకు, ఓ ఆది శేషుడా! భూమిని పట్టుకో.
ఓ కూర్మమా ! భూమినీ ఆదిశేషుని కదలకుండా పట్టుకో.
ఓ వరాహమా ! భూ దేవిని, ఆదిశేషుని, కూర్మాన్ని కదలకుండా పట్టుకో.
ఓ దిగ్గజములారా ! భూ దేవిని, ఫణిని, కూర్మాన్ని, వరాహాన్ని గట్టిగా పట్టండని ఈ పద్య తాత్పర్యం.

సందులు గొందులు రాముడు గీముడు అనే దేశీయాలను ప్రయోగించినా రాముని ప్రతాపంతో బాటు శివుని విల్లు అనే హెచ్చరిక కనిపిస్తుంది. జనకుని కుమార్తె సీతను రామచంద్రునికి, తమ్ముడు కుశధ్వజుని కుమార్తెలు మాండవీ, ఊర్మిళ, శ్రుత కీర్తులను భరత లక్ష్మణ శత్రుఘ్నులకిచ్చి వేరు వేరుగా ఒకే ముహూర్తంలో వివాహం జరిపించింది మొల్ల, వాల్మీకి రామయణంలో జనకుని కుమార్తెలు సీత, ఊర్మిళలు. దశరథుని తమ్ముడు కుశధ్వజుని కుమార్తెలు మాండవీ, శ్రుత కీర్తులు.

అయోధ్యా కాండలో సూర్యాస్థమయ వర్ణన, పండు వెన్నలె రాత్రులు, చకోర పక్షులు కూడి ఉండగా కైక దశరథుని మునుపటి వరాలిమ్మని కోరింది. కోరికను నెరవేర్చుకోవడానికి తగిన నేపథ్య వర్ణన ప్రబంధ వర్ణనలను పోలి ఉంది. రామునికి పదునాలుగేండ్లు వనవాసం, భరతునికి పట్టాభిషేకం జరగాలని కోరుకుంది. సుమంత్రుని ద్వారా కైక కోరికను విన్న రాముడు అరణ్యాలకు వెళ్ళడం దశరథుడు రాముని వెంట కొంత దూరం అనుసరించటం పురజనులు దశరథుని, కైకను నిందించటం మొల్ల కల్పించిన సన్నివేశం. ఇక్కడ మంథర పాత్ర కనిపించదు. గంగానది ఒడ్డున రాఘవుడు గుహుని చూసి గుర్తించి పడవనేర్పాటు చేయమని నదిని దాటించమని అంటాడు. ఈ సందర్భంలో మొల్ల గుహుని పాత్రను వినయశీలిగా చిత్రించింది.

'సుడిగొని రాముని పాదములు సోకిన ధూళి వహించి రాయి యేర్పడ నొక కాంతయయ్యెనట, పన్నుగ నీతని పాదరేణు వి య్యెడ వడి నోడసోక నిదియే మగునోయని సంశయాత్ముడై కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయమ్ము పెంపునన్'

– అయోధ్యకాండ, 33వ పద్యం.

సంశయాత్ముడై గుహుడు రాముని పాదాలు కడిగాడు. కానీ వాల్మీకి రామాయణంలో ఈ ఘట్టం కనిపించదు. కానీ ఆధ్యాత్మ రామాయణంలో గుహుడు రామునితో నీ పాదాలు కడుగుతానని నిర్భయంగా చెపుతాడు.

'క్షాళయామి తవ పాదపంకజం నాథ దారుదృషదోః కిమంతరం
మానిషీకరణ చూర్ణమస్తి తే పాదయోరితి కథా పథీయసి.' రాతికి కొయ్యకు తేడా ఏమిటి ? నీ పాదాలందు మానిషీకరణ చూర్ణం ఉందని విన్నాను. అందుకే నీ పాదాలు కడుగుతానని ఆధ్యాత్మ రామాయణంలో గుహుడు అంటాడు.

అరణ్య కాండంలో సీత సౌందర్యాన్ని శూర్పణఖ రావణునికి వివరిస్తుంది. 'కన్నులు కలువలో ! కామ బాణంబులో ? తెలివిగా నింతికి తెలియరాదు. పలుకుల కిన్నెర పలుకు కేలో చిలుకల పలుకులో నాతి నేర్పరురాదు' అని చెప్పి శృంగార మెల్లనిలువున బొంగారుచునుండు అని వర్ణించింది.

సీతను రావణుడు రథం మీద తీసుకొని ఆకాశ మార్గంలో వెళతాడు. సీత ఆర్తనాదం విన్న జటాయివు యుద్ధానికి తలపడటం, పక్షి రెక్కలను ఖండించి వేయటం, సీత సగల మూటను వానరులు సంచరించే కొండపై పడవేయటం ఈ కాండంలోని వస్తువు. లేడి చర్మాన్ని బాణానికి తగిలించుకొని సీతకు కానుకగా తీసుకురావటాన్ని మొల్ల చిత్రించింది. వాల్మీకి రామాయణంలో రాముడు లేడి మాంసాన్ని సీతకోసం ఆశ్రమానికి తీసుకువస్తాడు.

సీత కనిపించని రాముని వేదనను మొల్ల ఐదు పద్యాలలో వర్ణించింది. రాముని పరివేదన కాళిదాసు విక్రమోర్వశీయంలో పురూరవుని పలవరింపును, ఉత్తర రామాయణంలో రాముని పలువరింతను జ్ఞప్తికి తెస్తుంది.

చని చని యెదుటను రాముడు
గనుగొనియె మహీజనోగ్ర కలుషాద్రి మహా
శని రూపం బనదగునా
ఘనముక్తి వధూ విలాస బరిన్ శబరిన్.

–అరణ్య కాండ, 71వ పద్యం.

లోకంలో జనుల పాపాలు అనే కొండలకు పిడుగు వంటిదట ముక్తి కాంతా సవిలాస కేశపాశమట. కలుషాలకు విముక్తి కలిగించే శబరిని కలుస్తారు. సుగ్రీవుని వలన పనులు సమకూరుతాయనిశబరి చెప్పి పంపిస్తుంది. శబరిపై శ్రీరాముని అవ్యాజానురాగ వ్యాజంతో శ్రీరామ భక్త పాలనను వర్ణించటంలో కడు ఆసక్తి గలది మొల్ల.

కిష్కింధ కాండలో రాముడు జానకి శిరోరత్నాన్ని ఆనవాలుగా తీసుకురమ్మని హనుమంతునికి చెపుతాడు. రాముడు వాలిని చంపి సుగ్రీవుని కపిరాజ్య పట్ట భద్రుని జేసి అంగదుని యువరాజును జేసి ఒక్క నెలలో జానకి జాడ కనుగొనమని హనుమంతుని పంపిస్తాడు.

సుందర కాండలో రాక్షస మధ్యలోనున్న సీతను చూసి మనుష్య భాషలో హనుమంతుడు రాముని జాడను చెప్పి ఉన్నాడు, ఉన్నాడని అభయమిచ్చాడు.

ఉన్నాడు లెస్స రాఘవు
డున్నాడిదె కపుల గూడి, యురు గతి రానై
యున్నాడు నిన్ను కొనిపో
నున్నాడిది నిజము నమ్ము ముర్వీ తనయా

సుందరకాండ, 91వ పద్యం

రాముడే రీతి వాడని సీత ప్రశ్నింపగా హనుమంతుడు శ్రీరాముని వర్ణించి, లక్ష్మణుడిని ఏక వాక్యంలో విభేదించి ఈ విధంగా వర్ణిస్తాడు.

నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాడు
ధవళాబ్జ పత్ర నేత్రముల వాడు
కంబుసన్నిభమైన కంఠంబువాడు
బాగైన యట్టి గుల్ఫముల వాడు
తిన్ననై కనుపట్టు దీర్ఘ బాహుల వాడు
ఘనమైన దుందుభి స్వనమువాడు
పద్మరేఖలు గల్గు పదయుగంబుల వాడు
చక్కని పీన వక్షంబు వాడు
కపట మెఋుగని సత్యవాక్యముల వాడు
రమణి ! రాముడు శుభ లక్షణముల వాడు
ఇన్ని గుణముల రూపింప నెసగువాడు
వరుస సౌమిత్రి బంగారు వన్నె వాడు.

– సుందర కాండ, 102 వ పద్యం

అకళంక రామభక్తి కలది మొల్ల. కథాగమనంలో స్వల్ప కథలను విడిచి, విడువక ఇంచుక స్ఫురణకు తెచ్చిసాగిపోవటంలో ఈమె నేర్పరి.

సుందర కాండను అలతి పదాలతో సుందరంగా తీర్చిదిద్దింది. సీత జాడను కనుగొన్న ప ానుమంతుడు సీతకు రాముని అంగుళీయాన్నిచ్చి ఆమె శిరోరత్నాన్ని గైకొని రాముని కడకు వస్తాడు . సీత పరిస్థితిని రామునికి విన్నవిస్తాడు.

కట్టిన వస్త్రంబు కట్టు కొంగే తప్ప జీర్ణించి పోయిన చీర తోడ
నుడగని నగలచే నోరంత ప్రొద్దును చెక్కిట జేర్చిన చేయితోడ
బుడమిపై బొరలాడు నొడలు బూడిదబ్రుంగి

నిరతంబు దొరగు కన్నీటి తోడ
నిడుద పెన్నెఱి వేణి సడలించి జడలతో నిరత నిరాహార నియతితోడ
గినుక జంకించు దైత్యకామినుల నడుమ
దీపము చేయుచు దనుజ బాధలకు నోర్చి
వనిత ప్రాణంబు దక్క సర్వము త్యజించి
నిత్యమును మిమ్ము మదిలోన నిల్పియుండు.

– సుందరకాండ, 246వ పద్యం

పతిచే విడువ బడిన అహల్య దుస్థితి ఎట్లుండెనో లంకలో సీత స్థితి కూడా ఆ విధంగానే కనిపిస్తుంది. భర్త ఆదరణ లేని స్త్రీ స్థితిని, ఆనాటి సామాజిక స్థితిని వర్ణిస్తుంది. అహల్య ఎవరికీ కనిపించదు. సీత దైత్యుల నడుమ ఉన్నదన్న ఒక్క భేదం తప్ప ఇద్దరికీ పెద్ద తేడా లేదు.